("జ్యోతి" మాసపత్రిక; దీపావళి 198[illegible])

చక్రం

"సార్!"

నెమ్మదిగా పలకరించాను, మా జోనల్ ఆఫీసర్ చక్రారావుని.

"యెస్?" చక్రారావు; చూస్తున్న కాగితాల్లో పేజీ యెగిరిపోకుండా మోచెయ్యి అడ్డంపెట్టి, తలెత్తి, కళ్ళజోడు పై అంచుల మీది నుంచి చూసేడు; గడుగ్గాయి మిరాసీదారు కరణంగారు అమాయక నిశానీదారు పేదరైతువేపు చూసినట్టు.

"కమలాకర్రావు పోయాట్టకదండీ–" అని ఆగాను.

"ఔనండీ పాపం; నాకూ ఇంతకు ముందే తెల్సింది."

"శవం ఇంకా కదల్లేదండి. వాళ్ళ తమ్ముడికోసం చూస్తున్నారు. అతను ఇప్పుడో ఇహనో రావాలి.... తీసేసేలోపుగా మన స్టాఫ్ నలుగురూ ఓసారి వెళ్ళి చూదామంటున్నారండి...."

"ఓ షూర్!....అలాగే వెళ్ళిరండి....కాని: అంతా ఒక్కసారే వెడతారా? ....ఆఁహఁ. మరేం లేదూ; గబుక్కున హెడ్డాఫీసు నించి ఏదైనా సమాచారం కావాలని ఫోను వచ్చిందనుకోండీ: నేను ఒక్కణ్నే అయిపోతానే!" అని కిటికీ లోంచి బైటికి చూడసాగాడు చక్రారావు.

నేను నా వెనకాల నిలబడి వున్న బలగంవైపు చూశాను. మళ్ళీ యిటు తిరిగి "తమర్రారాండీ?" అన్నాను జాలిగా.

చక్రారావు అంతకంటే అమాయకంగా, జాలిగా నవ్వేడు. రెండు క్షణాల్లో ఆ నవ్వుని మింగేసి, చేతిలో వున్న కలాన్ని పెన్ స్టాండులో బిగించేడు' కుర్చీలో వెనక్కి చారబడి ఒక్కసారిగా ఆఫీసరైపోయాడు.

"హౌడుయు మీన్? మీలో ఎవరో ఒకరిద్దరు ఆఫీస్‌లో వుండి ఏదైనా యమర్జన్సీ వస్తే నాకు తోడ్పడుతారని నేననుకుంటూ ఉంటే మీరేమో ఆఫీస్‌కి

తాళం వేసేసి నన్నుకూడా లాగేద్దామని చూస్తున్నారా?— నో!—నేను రావడం కాశ్చన్ లేదసలు.... ఆల్‌రైట్! హెడ్డాఫీసు నించి ఫోనొస్తే నేనే ఎల్లాగో తంటాలు పడతాన్లెండి, మీరందరు వెళ్ళండి....రమణారావున్నారా?"

"యస్సార్" అని వెనక నించి ఓ బొంగురుపోయిన గొంతు:

"మన ఆఫీస్ కొత్త బిల్డింగ్ ఫైల్ తెచ్చి ఇక్కడ పెట్టండి."

"ఆయ్."

"వామన్రావు గారూ; ఎక్స్‌పోర్టు లైసెన్సు రద్దు చేస్తామంటూ నిన్న వొచ్చిన లెటర్ వెంటనే పెట్టమన్నాను, పెట్టేరే కాదు! అది కూడ ఆ ఫైలతో పాటు తెచ్చికక్కడ పడింది; నేనే రాసుకుంటాను!.... ....ఈ ఎకౌంట్స్ మాస్టర్ పంతులు గారేరీ? బ్యాంకెక్కళ్ళి పోయారా, దొరగారు? ఇహనివాళ్టికి ఇంతే సంగతులు గాబోలు....అక్కణ్ణించలా కమలాకర్రావింటి కెళ్ళి స్మశానానికెళ్ళి అంచి కెళ్ళి ఇంక మధ్యాహ్నం వారి దయుంటే ఏ మూడింటికో దయ చేస్తారు లేక పోతే—

"అన్యాయం సార్; అతను కేష్ పట్టుకుని అలా షికార్లు కొట్టే మనిషి కాద్సార్" అన్నారు వెనకనించి ఎవరో.

"ఏమో—"

"మరి అతను కూడా అక్కడొకసారి కనిపించాలి కదండి సార్? పైగా అతను కమలాకర్రావుకి కొంచెం బంధువు కూడా కదండి?" అన్నాను.

చక్రారావు తను అంతసేపూ మోచేతుల్తో అణిచిపెట్టిన ఫైల్ మూసేసాడు. దాన్ని తాళ్ళేసి కట్టేస్తూ చేతులు తిప్పుతూ అన్నాడు "అదికాదు బంగార్రాజుగారూ! నేనొకటంటే మీరింకోటేదో అంటున్నారు! ....బ్యాంకెక్కళ్ళిన మనిషి అంత హెవీకాష్ పట్టుకుని ఫ్రెండ్సిళ్ళకీ, శ్మశానానికీ ఎందుకండీవెళ్ళడం? తిన్నగా ఆఫీసుకొచ్చి ఆ కేషేదో చెస్ట్‌లో పెట్టేసి వెళ్ళొచ్చుగా....బంధువే. నేనేం కాదన్లేదు. ఆ మాటకొస్తే కమలాకర్రావుకి బంధువులో స్నేహితులోకాని వాళ్ళు ఎవరున్నారో చెప్పండి? సూర్యారావుగారూ ఆయన ఒక వీధిలో ఉంటున్నారు. అవునా కాదా? సత్యనారాయణగారు ఆయన క్లాస్మేటు— ఇంక మీరూ ఆయనా ఎన్ని విషయాల్లో ఎంత క్లోజ్‌గా ఉంటారో అన్నది ఎవరికి తెలియని రహస్యమూ కాదుకదా! ఓ విధంగా చెప్పాలంటే కమలాకర్రావు నాకూ బంధువే,

మరి! కాని ఈ ఆఫీసులో మనకందరికీ కొన్నికొన్ని బాధ్యతన్నాయి కదండీ! మన హెడ్డాఫీసు మనల్నందరినీ యిక్కడెందుకు వేసింది? పన్లన్నీ టైమ్ వేస్ట్ కాకుండా చేస్తామనే కదా. అలాంటప్పుడు ఇలాంటి ఫార్మాలిటీస్ కోసం మన అమూల్యమైన కాలాన్ని- అందులో డ్యూటీ అవర్స్ని- వేస్ట్ చెయ్యడం తప్పా కాదా; పోనీ మీరే చెప్పండి?"

తప్పే సార్; నిజమే సార్ మీరన్నది" అన్నదే ఆ సమయంలో మాట. అంతేగాని "అదేంటి సార్: అలా అంటారు? ఇలాంటి ట్రాజెడీ వొచ్చినప్పుడే కదా, ఆత్మీయులైన వాళ్ళనించి రెండు కన్నీటి చుక్కలు ఆశిస్తారు యెవరైనా!" అని చెప్పలేదెవరూ.

"అయితే సార్; పోనీ, మనందరి తరపునా బంగార్రాజుని పంపిద్దామండి?" అన్నాడు సూర్యారావు.

చక్రారావు ఓసారి కళ్ళు మూసుకొని తెరిచాడు. ఏదో నాటకంలో అభినయిస్తున్న వాడిలాగా తల అడ్డంగా ఆడించి చేతులు ఇటూ అటూ వూపాడు. "నో, నో!" అన్నాడు మళ్ళీ నాలుగు క్షణాలు వ్యవధిచ్చి. "అందరూ వెళ్ళండి, నేనిందాకా అడిగిన ఫైల్సన్నీ మాత్రం తెచ్చిక్కడ పడేండి. అవతలి రూంలో టెలిఫోనుకి ప్లగ్ తీసేండి" అని చెప్పేసి ఆ పెద్దఫైలు మళ్ళా తెరిచి చదువుకొంటూ కూర్చున్నాడు.

ఉద్యోగులు ఒక్కొక్కరూ. శవాన్ని చూడ్డానికి వెళుతున్న వాళ్ళలా కాకుండా శవాన్ని వొదిలి వెళుతున్నంత నెమ్మదిగా బైటికి నడిచారు. ముందొచ్చాను కనక ఆఖరికి మిగిలిపోయాను.

వెళ్ళిపోడానికి ఓ అడుగు అటు చేస్తూ చక్రారావు వేపుజాలిగా చూసేను. చక్రారావు క్షణంలో సగంపాటు నా చూపులో చూపు కలిపి; ఆ మరుసటి సగంలో ఆగమన్నట్టు చేత్తో ఓ సంజ్ఞ చేసి; ఆ చేతితో టేబిల్ మీద ఒక్క దెబ్బ కొట్టి, "అన్నట్టు మర్చిపోయాను!" అన్నాడు.

స్విచ్ వేస్తె లైటారిపోయినంత వేగం ఆగిపోయాను. ఎక్కడున్నవాణ్ణక్కడ.

"అక్కడ పంతులుగారు కనబడితే ఆ క్యాష్ బ్యాగ్ పట్టుకుని వెంటనే ఆఫీసుకు రమ్మరండి!" అని; నావేపు ప్రత్యేకమైన అభిమానంతో చూస్తూ

చెయ్యి పూపి తనకి చాలా దగ్గిరిగా రమ్మంటూ సంజ్ఞ చేసేడు. నేను అతనికి చాలా దగ్గిరిగా వచ్చి అతని మీదికి వంగాల్సి వచ్చింది. చక్రారావు గొంతు బాగా తగ్గించి చెప్పాడు: నే చెప్పేది జాగ్రత్తగా వినండి. ఏంటంటే, అక్కడ పరిస్థితి ఎలా వుంటుందో మనం చెప్పలేం....ఏమంటా?....గబుక్కుని డబ్బు అవసరం రావొచ్చు. ఎలాంటెలాంటి తెగింపులు పుడతాయంటే చేతిలో ఉన్న డబ్బు మనదా, నలుగురిదీనా. గవర్నమెంటుదా అనే విచక్షణ ఉండదు. నే చెప్పేది బోధపడుతోందా? అంచేత....ఏది?....అతను—అంటే పంతులుగారన్నమాట —అక్కడ గానీ వుండిపోయాడంటే; ఒక మూమెంట్‌లో అతను గోతులో పడ్డమేగాదు; మనందర్నీ గోతులో తోసీగల్డు....తెలిసిందా? అంచేత ముందతన్ని క్యాష్‌బ్యాగ్ పట్టుకొని ఇటొచ్చీమనండి. అది సేఫ్‌తో పెట్టేసీ;కావాలంటే మళ్ళీ వెళ్ళి సాయంకాలం దాకావుంటాడో రాత్రల్లా కూడా వుంటాడో అతనిష్టం! తెల్సిందా?"

చక్రారావు తెలిపే ప్రతి మాటకీ ఆమోదం తెలిపే ఆంగికం ఒకటి; కళ్ళతో, చేతుల్తో, తలతో చేస్తూ విధేయతని కూడా పన్లో పనిగా ప్రకటించేను.

చక్రారావు మళ్ళీ మొదలెట్టాడు. "పాపం; నిజమే, డబ్బు అవసరం పడ్తుంది. నిజానికి కమలాకర్రావు జీతం అంతా కూడా ఇవాళ అక్కడ అవసరమయ్యే ఖర్చుకి చాలకపోవచ్చు. కానీ మనమేం చేస్తాం? పోనీ మనం ఏదైనా జాలిగా చేసేసినప్పటికి దాని ఫలితం ఈ నెలంతా మనల్నందర్నీ బాధ పెడ్తుంది. కాదంటారా?"

"ఔనండౌనండి.... కానీ, ఇందులో రెండు పాయింట్లున్నాయండి. కమలాకర్రావు నిన్నటివరకు డ్యూటీలో ఉన్నాడు కాబట్టండి, అతని జీతంకూడ అందరితో బాటు బిల్లేసి తెచ్చేమండి. ఆ డబ్బు అతనికో అతని పెళ్ళానికో ఇచ్చెయ్యాలండి. దానికే రూలూ అడ్డం రాదండి. ఒక వేళ ఆవిడ; చట్టరీత్యా తనే కమలాకర్రావుకి వారసురాల్నని సర్టిఫికేటు తెచ్చుకునే దాకా ఆ డబ్బు ఆవిడకివ్వకూడదనుకుంటే ఉంకోటుందండి, ఉద్యోగస్తుడెవరైనా చనిపోతేనండి, శవ వహనానికి, ఆ సంబంధంగా అయ్యే ఖర్చులకనండీ; అయిదు వందల రూపాయలు కసురే శాంక్షన్‌చేసి డైరెక్టుగా ఆవిడకిచ్చీయొచ్చండి, అంచాతండి—"

చక్రారావు నోటికి చెయ్యడ్డం పెట్టుకుని "అయ్యో, అయ్యో!" అన్నాడు. "అతను చనిపోయాడని మనకి కాగితంమీద రిపోర్టు లేదండీ బాబూ అవునూ! ఎవరిచ్చేరు, రిపోర్టు? నేనిలా మాటాడుతున్నానని మరోలా అనుకోకండీ. మీరు చెప్పారు; రైటే. కమలాకర్రావు చనిపోయాడనడానికి సందేహంలేదు. కానీ మరి ఆఫీసన్నప్పుడు ఏవో కొన్ని రూల్సుంటాయికదా. రేప్పొద్దున్న ఏ ఆడిట్ బాబొ వచ్చి పార్టీ చనిపోయినట్టు రిపోర్టులేదు. శవ దహనానికి గ్రాంట్ ఇమ్మని అప్లికేషన్ లేదు; డబ్బు ఎలా డ్రా చేసి ఇచ్చేసేవు నాయనా అని నా పీక పట్టుకుంటాడు, బాబ్బాబూ ఏదో తొందర్లో అలా చెయ్యవలిసొచ్చిందయ్యా అంటే వాడూరుకుంటాడా?" అని అలసిపోయాడు.

లోపలి అసహ్యం ఆగ్రహం వ్యక్తపరచకండా వుండడానికి ఒకటే మార్గం.

దీర్ఘంగా "ఆయ్...." అని; మరి తిరిగి చూడకుండా దాటేశానక్కణ్ణించి.

o o o

పదిహేను రోజులైంది.

చక్రారావులాంటి క్రూరులు దయాహీనులు భూప్రపంచకం మొత్తంమీద ఎవరూ ఉండరనీ ఉద్భవించరనీ నిశ్చయానికి రాదగిన సంఘటనలు జరిగాయి.

ఆరోజు కమలాకర్రావు అంతిమ యాత్రకి ముందు ఆఫీస్ స్టాఫ్ అంతా అక్కడికి వెళ్ళేంకదా. అప్పటికే అక్కడ కేషియర్ పంతులు ఉన్నాడు; కమలాకర్రావు తమ్ముడు రామనాథం రానూ వొచ్చాడు. అన్నగారు పోయాడని టెలిగ్రాం రాగానే అతను ఎలా ఉన్నవాడు అలాగే బయల్దేరి వొచ్చేశాడు. కాకినాడ నుంచి విశాఖపట్నానికి రావడానికి అతనికి ఆ కబురందిన వేళకి బస్సు గాని రైలుగాని లేని కారణంగా పాపం; కత్తిపూడి జంక్షన్ వరకు ఎవరో కార్లో లిఫ్ట్ ఇవ్వగా చేరుకుని, అక్కణ్ణించి లారీ ఎక్కి విశాఖపట్నం వచ్చేడుట. అందరికీ నెలాఖరే కదా. అతనుకూడా ఏమంత స్థితిలో లేడు. కాలేజీలో లెక్చరరే గాని పద్ధతిగా జీతాలు చెల్లించే కాలేజీ కాదది. వాళ్ళావిడ, కూతురు "మేమూ వస్తాం"మని లబో దిబో అంటే ప్రయాణం ఖర్చులకి ఎక్కడో ఏదో ఏర్పాటు చేసుకుని మర్నాడు రమ్మని చెప్పేసి తను ఒక్కడూ అతి కష్టం మీద అలా వొచ్చేడుట. కమలాకర్రావు కొడుక్కి ఆరేళ్ళ వయస్సు. అంచేత తల కొరివి

పెట్టడం నుంచి పది పన్నెండు రోజుల శ్రాద్ధ శౌచ కర్మలన్నీ కమలాకర్రావు తమ్ముడు రామనాథమే చెయ్యాలన్నారు. కర్మలన్నిటికీ డబ్బు ఖర్చవుతుంది. అలాగా ఇలాగా కాదు- వందలు, వందలు! అందరికీ ప్రావిడెంటు ఫండు వుంటుంది. కాని దాంట్లోంచి డబ్బు కావాలంటే అదో పెద్ద పరమపద సోపాన పటం. దాన్నిండా ఎక్కడికక్కడ పాములూనూ.

ముందు శవం కదలాలి.

కిందటి రాత్రి పదకొండున్నరకి పోయాడు కమలాకర్రావు. ఈ జనం అంతా పోగయ్యేసరికి మర్నాడు మధ్యాహ్నం ఒంటి గంట అయింది. ఈ ఇంట్లోనే కాక ఇరుగూ పొరుగూ వాటాల్లో కాపరాలున్న వాళ్ళు కూడా వంటా పెంటా చేసుకోకూడదని లెక్క. ఏదో నగర సంస్కృతి ఇరుగు పొరుగు లెవరో వాళ్ళ కష్టసుఖాలేమిటో యెవరూ పట్టించుకోరని పేరయితే పడిపోయారు గాని నిజానికి ఇలాంటి సందర్భాల్లో సంప్రదాయానికి వ్యతిరేకంగానూ దానికి ఎదురు తిరిగ్గానీ ప్రవర్తించడం లేదెక్కువ మంది, ఇప్పటికి కూడానూ.

స్టాఫ్‌కి జీతాలివ్వవలసిన సొమ్ము బ్యాంకునుంచి డ్రా చేసి తెచ్చిన కేషియర్ పంతులు ఆ సంచితో సహా అక్కడున్నాడు. అపర కర్మలు చేసే బ్రాహ్మలు ఎక్కడ దొరుకుతారు, శ్మశానంలోకి కట్టెలు ఎవరు రవాణా చేస్తారు అనేవి కనుక్కొని ఆ పన్లు జరగడానికి రూఢి చేసింది అతనే. ఆ క్యాషంతా పుచ్చుకుని తన మోపెడ్ మీద నాలుగైదు చోట్లకి తిరిగి తిరిగి వొచ్చాడు.

కమలాకర్రావుతో మా పరిచయం గట్టిదే. ఇక్కడ జోనల్ ఆఫీస్ పెట్టినప్పట్నించీ మేం అందరం సహోద్యోగులమే. కాని అతని భార్యనిగాని తల్లిని గాని ఆఖరికి పిల్లల్ని గాని మాకెవరికీ గట్టిగా తెలీదు. కాకినాడ నించొచ్చిన కమలాకర్రావు తమ్ముడు రామనాథం మాకు మొదటిసారిగా అక్కడే పరిచయం. ఊళ్ళో కమలాకర్రావు మేనత్త ఒకావిడ ఉంది. ఆవిడ, ఇద్దరు కొడుకులు వచ్చారు. ఇరుగూ పొరుపల్లో కమలాకర్రావు కులానికి చెందినవాళ్ళూ అయిన వాళ్ళనదగినవాళ్ళూ ఈ సన్నివేశానికి తగిన వేషాల్లో ముఖకవళికల్తో అక్కడ వుండిపోయారు, జీతాల రోజైనా ఆఫీసుల కెళ్ళడం మానేసి.— "ఏం గురూ, పొజిషనెలాగుంది అని అడిగాను పంతుల్ని విడిగా పిల్చి సన్నని గొంతుతో.

"కొంపలో తంతే దమ్మిడీ లేదు, ఆ తమ్ముడు కూడా దారి కర్చులికి

ఎక్కడో అప్పు గోక్కని వొచ్చాడు. ఇదంతా ఇల్లా వుండగా ఈ రాత్రినుంచీ భోజనానికి మెంబర్లు పెరుగుతారు."

"ఇరుగూ పొరుగూ, ఆ మేనత్తగారు?"

"సడేలే—ఏదో సామెత చెప్పినట్టు!" అని మూతి విరిచేడు పంతులు.

"మరిప్పుడెలాగ? దగ్గిర దగ్గిర ఐదారు పందలు కర్చుంటుందే. ఇప్పుడు?"

"అదే అదే. నేను సూర్యారావుని ముందు అడిగాను. బ్రదరూ. నీకు జీతంతో పెద్దగా పన్లేదు కదా; ఓ సంతకం నా మొహాన పడీ; సరిగ్గా ఆరువందల యాభై రూపాయలు రౌండు ఫిగరు కదా! అదిక్కడ పడేసి మన పన్లమీద మనం పోదాం. నీకా సొమ్ము నింపాదిగా సర్దేస్తాం ఒరే, అని!....కానీ వాడికి ఈ నెల్లోనే వచ్చిందట ఏదో యిబ్బంది. చెల్లెలు పురుటికొచ్చింది; వాళ్ళత్తగారు ఐశ్వర్యవంతులు కావడంచేత గవర్నమెంట్ ఆస్పత్రిలో కాకండా ప్రయివేట్ నర్సింగ్ హోంలో చేర్చవలసొచ్చింది; రేపు ఉదయం డిశ్చార్జి చేస్తారు; బిల్లు కట్టి తీసుకు రావాలి; నాన్నగారు బిజినెస్ పనిమీద కలకత్తా వెళ్ళేరు! అంటూ కథలు చెప్పుకొచ్చేడు త్రాష్టుడు. పంతులూ పంతులూ తలా కాస్త యిచ్చు కుంటాం గానీ అంతా నా వొక్కడి నెత్తిని మాత్రం రుద్దకురా అంటూ తగులు కున్నాడు. ఏం చేద్దాం? వాళ్ళప్పుడే లోపల లజ్జుగుజ్జులు పడుతున్నారు" అని చెప్పేడు పంతులు.

అంతా వెంటనే సెటిల్ చేసేసేనని అనుకున్నాను. "కమలాకర్రావు జీతం కటింగులు పోను నాలుగువందల తొంభై రెండు రూపాయలు కదా; ఆ సొమ్ము లెక్కెట్టేసి ఇచ్చీ. ఓ రెవెన్యూ స్టాంపు తీసుకుని తెల్లకాయితం మీద అంటించీ, మన జోనల్ ఆఫీసర్ గారికి ఒక ధరకాస్తు రాసీ; ఏమనీ; అయ్యా నా భర్త అయిన ఫలానా కమలాకర్రావు నిన్న అనగా 1985వ సంవత్సరం జూన్ నెల 30వ తేదీ అర్ధరాత్రి చనిపోయారు. వారికి మీ ఆఫీసులో పని చేసి నందుకు గాను 1985 జూన్ నెలకు జీతం కటింగులు పోను నాలుగు వందల తొంభై రెండు రూపాయలు వచ్చినట్లు తెలిసింది గాన; వారికి చట్టరీత్యా నేనే వారసురాలను గనుక సదరు సొమ్ము నాలుగు వందల తొంభై రెండు రూపాయలు నాకు చెల్లించ ప్రార్థన. ఆ అప్లికేషన్ మీద, ఈ రెవెన్యూ స్టాంపుమీద ఎలాగో ఓలాగ రెండు సంతకాలు ఆవిడవి తీసేసుకో. అన్నట్టు మర్చి పోయేను. మరో తెల్ల కాయితం తీసుకుని మన జోనల్ ఆఫీసర్ గారి పేరిట

ఇంకో అప్లికేషన్ తీసుకో.అయ్యా: మీ ఆఫీసులో పనిచేస్తూ నిన్న రాత్రి హఠాత్తుగా చనిపోయినటువంటి ఆర్, కమలాకరరావు నా భర్త. ఇటీవల వచ్చిన ఒకానొక నిబంధన ప్రకారం సర్వీసులో ఉండగా హఠాన్మరణం చెందిన ఉద్యోగి యొక్క అంత్యక్రియలు నిమిత్తము ఐదువందల రూపాయల వరకు శాంక్షన్ చేస్తారని తెలుస్తున్నది. ఈ నిబంధన ప్రకారం తమరు నా పేరిట తొందరగా ఐదు వందల రూపాయలు శాంక్షను చేసి చెల్లించవలసిందిగా ప్రార్థిస్తున్నాను---అని రాయించి ఆ అప్లికేషన్ కూడా తీసుకో. రేపు ఆ ఐదు వందలూ కూడా ఇప్పిద్దాం" అన్నాను.

కానీ అందరం పప్పులో కాలేశాం.

"నా భర్త జీతం నాకిప్పించండి" అని రాసిన అప్లికేషన్ మీద "మీరే ఆయనకి చట్టరీత్యా వారసురాలని తాలూకా ఆఫీసు నుంచి సర్టిఫికేట్ తెచ్చుకుంటే తప్ప ఆయన జీతం మీకివ్వడానికి వీలుపడదు" అని ఆర్డరేశాడు మా జోనల్ ఆఫీసర్ చక్రారావు.

"దహన సంస్కారానికి గ్రాంటు ఇవ్వాలంటే డెత్ సర్టిఫికేట్ ఉండి తీరా"లని ఆ కాగితం తిప్పేశాడు.

కమలాకర్రావు భార్యకి అక్కడికక్కడ చెల్లించిన నాలుగు వందలతొంభై రెండు రూపాయలు నేను. సూర్యారావు, రమణారావు, పంతులు నలుగురం పెట్టుకున్నాం తరువాత ఎప్పుడో ఆవిడ ఇస్తే ఇచ్చినట్టు: లేకపోతే ఇక అంతే సంగతులనుకున్నాం.

నాటికీ నేటికీ ఆవిడ లీగల్ హేర్ సర్టిఫికేట్ తెచ్చుకోనే లేదు.పన్నెండో రోజు కర్మ అయ్యేదాకా ఆవిడ ఇల్లు కదలకూడదన్నారు. పోనీ ఇంకెవరైనా వెళ్ళొచ్చు కదా అంటే పుట్టెడు దుఃఖంలో ఉన్నారు ఎవర్నని వెళ్ళమంటారు చెప్పండి అని తేల్చేశారు. దహన సంస్కారానికి ఇచ్చే గ్రాంటు అయిదు వందలకి బిల్లు వేసేనంటాడు పంతులు కాని క్యాష్ చెయ్యలేదంటున్నాడు.

మా డబ్బులు పోయాయని కాదు బాధ.కమలాకర్రావు భార్యకి న్యాయంగా రావలసిన డబ్బు ఇప్పనీడం లేదు మా జోనల్ ఆఫీసర్ చక్రారావు. ఆ రోజు శవం కదిలేలోపుని ఓసారి వెళ్ళి ఆవిణ్ణి పరామర్శ కూడా చెయ్యలేదు.అప్పుడు నాలుగువందల తొంభై రెండు రూపాయలు ఇచ్చేశాక మేమంతా వెంటనే వొచ్చే

శాము. ఆ తరువాత ఈయన ఎవరి ఫైళ్ళు వాళ్ళకిచ్చేసి తన జీతం తీసేసుకుని నాకు బైట పనుంది వెడతానని వెళ్ళిపోయాడు. బైటికి ఏదో పని మీద వెళ్ళిపోతూనైనా సరే ఓసారి ఆవిణ్ని పలకరించి వెళ్ళొచ్చుగా" అని అందరం తిట్టుకోవడం మిగిలింది.

అలా ఈ పదిహేను రోజుల్నించీ అతని మానవద్వేష ప్రవృత్తినీ సానుభూతి రాహిత్యాన్నీ విమర్శించుకోడంలో ఇప్పుడే కాదు ఇతనెప్పుడూ ఇంతే అన్న సంగతి కూడా తెలిసింది. జోనల్ ఆఫీసు ఇక్కడ ఏర్పడక ముందు ఈ చక్రారావు మాలాగనే చిరుద్యోగే. అప్పుడు కూడా ఇతనింతే. సాటి మనిషి మీద సానుభూతి ఎన్నడూ లేదు. పనిలో రాక్షసుడు. దానికెవరూ మరో మాట చెప్పలేరు. కాని అతని నిజాయితీ కఠోర పరిశ్రమ యంత్రవత్‌గా వచ్చేవేతప్ప దాంట్లో యెక్కడా మానవాంశ ఉండేది గాదు.

ఈ పదిహేను రోజులూ అలా చక్రారావుని తిట్టుకుంటూనే దినచర్య ప్రారంభిస్తున్నాం. ఇలా అయితే ఎంతకాలం పని చెయ్యగలం? ఇవాళ కమలాకర్రావు కుటుంబానికి వొచ్చిన ఆపదలాంటిది రేపు మరెవరికైనా వొచ్చినా ఇంతే కదా.

ఈ పదిహేను రోజుల కాలంలో మాలో ప్రతి ఒక్కరు కమలాకర్రావు భార్యని పలకరించి ధైర్యం చెబుదామని విడివిడిగా వెళ్ళాం. ఆవిడకి కలిగిన నష్టాన్ని మాలో ఏ ఒక్కరైనాగాని అందరం కలిసికట్టుగా గాని తీర్చలేంఅన్నది ఖాయం. కాని అతను సర్వీసులో ఉండగా చనిపోవడం మూలాన్ని ఆవిడకి ప్రావిడెంట్ ఫండు గ్రాడ్యుయిటీ, కుటుంబ పెన్షను లాంటివి డబ్బురూపంలో వస్తాయని కూడా మాలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఒక్కొక్క బాపతు సొమ్ము ఎంతెంత వస్తుంది. దాన్ని రాబట్టుకోడానికి దరఖాస్తులు ఎలా రాయాలి రూల్ పొజిషన్ ఏమిటి అన్నీ చెప్పడానికి సిద్ధంగా మేం వెళ్ళాం. కాని ఆవిడ మమ్మల్నెవర్నీ చూడలేదు.

అభినందనో అభిశంసనో తెలీకుండా "ఈ కాలపు మనిషి కాదు!" అని ఒక రిమార్కు పాస్‌చేసి నిట్టూర్పు విడిచి వూరుకున్నాం.

ం ం ం

కమలాకర్రావు పోయిన ఇరవైనాలుగో రోజు ఉదయం పదిగంటలు కాక ముందే నేను ఆఫీస్‌కొచ్చేను. వరండాలో వాచ్‌మన్ రెస్టు డీసుకోడానికి. విజీ

టర్న్ కూర్చోడానికి వేసిన బెంచీమీద ఓ అమ్మాయి కూర్చుని వుంది. చేతిలో చిన్న వేనిటీ బాగ్ ఉంది. నన్ను చూడగానే లేచి నుంచుని "నమస్కారం" అనేసి కూర్చుంది.

ఇరవై అయిదేళ్ళు దాటుంటాయి. పొడుగ్గా వుం.. చామనచాయ. ఆకర్ష ణీయమైన పాలిస్టర్ చీర కట్టుకుంది. మెడలో ఒకటి పేట గొలుసు. నుదుట చిన్న నల్లచాదు బొట్టు. ఓ చేతికి బంగారు గాజులు రెండు రెండో చేతికి వాచి.

"నమస్కారం" అనేసి కూర్చోకపోతే "ఏం వచ్చావు, ఎవరు నువ్వు?" అని అడగవలసిందే. కాని ఆమె ముభావంగా కూర్చుండిపోతే నేనెందుకు పల కరించాలన్న ఉదాసీనత తెచ్చుకుని నేను మెయిన్‌హాలు తలుపు తెరిచి లోపలికి వెళ్ళిపోయాను.

ఓ నిమిషం గడిచేలోపుగా బైట వరండాలో వాచ్‌మన్ గవరయ్య అక్కడ కూర్చున్న అమ్మాయితో మాట్లాడుతున్న అలికిడి అయింది. "ఆయ నేనమ్మా ఎడ్ గుమస్తాగారు. ఎళ్ళి ంనపడండి." అన్న వాక్యంతో ఆ సంభా షణ ముగిసింది.

"నమస్కారం సార్. నా పేరు పద్మావతి. నన్ను గుర్తు పట్టలేదనుకుం టాను తమరు. నేను కమలాకర్రావుగారి భార్యని" అంది లోపలికి వచ్చి నా సీట్‌కెదురుగా నిలబడి.

"అయ్యో, అలాగా! సారీ." అన్నాను, కూర్చోమని సంజ్ఞచేసి.

"ఫరవాలేదండి" అని కూర్చుంది.

"నేను కాగితాలేవో చూస్తూ "మీకు చాలా అన్యాయం జరిగిపోయింది. ఇంకా జరుగుతూనే ఉంది కూడాను. ఆఖరికి మీకు రావలసిన డబ్బు విషయంలో కూడా తొందరగా పన్లు జరగడంలేదు. ఎన్నోసార్లు మా ఆఫీసర్‌గారికి చెప్పాను. ఆయన వేరే పన్లమీద శ్రద్ధ పెట్టాల్సి వచ్చి కాబోలు; మీ పన్లు చూడలేకపోతు న్నారు. ఇవాళ మళ్ళా చెబుదామనే అనుకొంటున్నాను.సరే మీరే వచ్చారు కదా ఓసారి కనిపించి వెళ్ళండి, ఆయనింకో అరగంటలో వచ్చేస్తారు" అన్నాను, చక్రారావు కఠినుడని క్రూరుడని ఈవిడ కష్టంపట్ల అమానుషంగా ప్రవర్తించే డనీ డైరెక్టుగా మా సహోద్యోగుల మధ్య మాట్లాడినట్టు మాట్లాడలేకపోయినా నాధోరణి నాకు సంతృప్తిగానేవుంది. ఆవిడకి ఏ మాత్రం బుర్రవున్నా అతని పద్ధతి, సానుభూతి రాహిత్యం అర్థమైపోతుంది కదా అని సంతోషించేసేను.

"అది కాదండి. నన్నిక్కడ కమలాకర్రావుగారి పోస్టులో జాయినవమని హైద్రాబాద్‌నించి ఆర్డర్సొచ్చేయండి. ఈ ఉదయం మా మరిదిగారు పట్టుకొచ్చి చ్చేరండి. ఆ అమ్మాయి, పద్మావతి.

చేతిలో వున్నవానిటీ బాగ్ వెతికి, ఒక కవరు, విడికాగితం ఒకటి తీసి నా చేతికి ఇచ్చింది.

"ఇదండి, ఎపాయింట్ మెంట్ ఆర్డరు. ఈ కవర్లోనండి. ఇట్లాంటిదే ఇంకోకాపీ ఉండటండి, అది మన ఆఫీసు ఫైల్లో పెట్టించమన్నారండి." అంది. విడికాగితం కవరు వేర్వేరుగా అందిస్తూ,

"ఐసీ-" అని ఒక్కచూపులో చదివేశాను.

అర్డరు- రైటే. రీజినల్ ఆఫీసునుంచి వచ్చినట్టు రబ్బరుస్టాంపు, జోనల్ ఆఫీసు విశాఖపట్నానికి చిరునామా,

"పోనీలెండి. పెద్ద ఆపదకి చిన్న ఊరడింపు." అన్నాను. "కంగ్రాచులేషన్స్" అని భారీగా నవ్వుతూ చెప్పవలసిన మాట కాదు, రెండు విధాలుగా కూడాను. "ఎంతమంది అడ్డుపడినా దేవుడు మేలు చెయ్యాలనుకున్నప్పుడు ఆగదు, మా స్టాఫ్ మెంబర్లు ఎంతమందిమి ఎన్నిరకాలుగా అనుకున్నామో మీకేదైనా సహాయంచేస్తే బాగుండునని. మా జోనల్ ఆఫీసర్‌గారికి పని వొత్తిడి వల్లనో మరే కారణం చేతనో మీకు సహాయపడ్డానికి సానుభూతి చూపించడానికీ తీరుబాటు లేదు. మీరు మంచి యుక్తిగా పై అధికార్లని వప్పించి మీ సంసారం ఛిన్నం అయిపోకుండా ఓ ఆధారం సంపాదించుకున్నారు."

ఆ అమ్మాయి తల అడ్డంగా ఆడించింది "అబ్బే అదేం మాటండి. చక్రారావుగారు తల్చుకోకపోతే ఇదేదీ అయ్యేదే కాదండి. వారే స్వయంగా మా ఇంటికొచ్చి నాదగ్గర దరఖాస్తు తీసుకుని దానిమీద గట్టిగా రికమండుచేసి హైద్రాబాదువెళ్ళి ఆర్డరేయించుకొచ్చేరండి. అసలు కమలాకర్రావుగారు ఉన్నప్పుడే నేనొక అప్లికేషను పెట్టేనండి; ఈ ఆఫీసులో ఏదైనా ఉద్యోగం యిప్పించమని. అబ్బో: రెండేళ్ళ నాటి మాటండి. దాని మీద కూడా చక్రారావు గారు గట్టిగా రికమెండు చేసేరండి. హైద్రాబాద్ వాళ్ళు ప్రస్తుతం కాళీల్లేవని తిప్పేస్తారేమోనని; ఈ ఆఫీస్‌లో పనెక్కువైంది: మరో మనిషి కావాలని కూడా

రాసేరండి. ఆ రోజు ఆ కాగితం రాయాలని వారికి గట్టిగా తోచినా ఆఫీసుకి సెలవైపోయిందని; మర్నాడే తనకి క్యాంపని; ఆయనే స్వయంగా టైపు చేసి తీసుకెళ్ళారండి. సర్లే చూస్తాం వెళ్ళమంటే అక్కడ ఎవరితోటో గట్టిగా చెప్పి వచ్చారటండి. ఈ ఆర్డర్ నాకొచ్చినట్టు వారికింకా తెలీదండి."

ఆమె ఈ మాటలు చెప్తుండగనే ఆఫీస్‌లోకి ఒకరొకరూ వస్తున్నారు సూర్యారావు కంటికి ఆనగానే చెయ్యి ఊపి, పిలిచి, "ఎస్టాబ్లిష్‌మెంటు ఫైలు పట్రా" అన్నాను. ఎవరికీ తెలియకుండా చక్రారావు ఈ కేసు ఎలా డీల్ చేసాడో చూద్దామని.

"ఆ ఫైలు పది రోజుల్నించి కనబడ్డం లేదు గురూ. ఒకవేళ జె.ఓ.గారి కేబినెట్లో ఉందేమో. చూడాలివాళ." అన్నాడు సూర్యారావు.

"చూడు చూడు!" అన్నాను.

***